క్లుప్తంగా

ఉమారుద్రునికి వెండి పానమట్టం



భక్తుల సహకారంతో తయారైన వెండి పానమట్టం

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామికి భక్తులంతా కలసి వెండి పానమట్టం వితరణ చేసినట్టు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు. మంగళవారం ఉగాది సందర్భంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పాన మట్టాన్ని స్వామివారికి అమర్చనున్నట్లు చెప్పారు. సాయంత్రం మహిళలచే సామూహిక సువాసిని పూజలు, కుంకుమార్చనలు జరుపుతామన్నారు. సాయంత్రం ఆరవెల్లి చంద్రశేఖరశర్మచే పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

నీలమ్మతల్లికి రూ. 50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పెద్దబరాటం వీధిలో ఉన్న గ్రామదేవత నీలమ్మతల్లి అమ్మవారికి భక్తులు రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయం రంగుల కోసం వినియోగించాలని కోరారు. భక్తులు కింతలి నాగేశ్వరరావు, బటారం బాబ్జీ తదితరులు సమకూర్చిన విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు బరాటం సాయిరాజ్‌కు సోమవారం అందచేశారు. ఆలయ కమిటీ సభ్యులు త్రిపురాన వరప్రసాద్‌రావు, పొన్నాడ రుషి, పి.రామశంకరరావు, ఎ.రమణ, అర్చకులు పెంట కిరణ్‌శర్మ ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు సంధ్య

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి విద్యార్థి తన జీవితంలో యోగా, ధ్యానాన్ని భాగం చేసుకోవాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకురాలు వి.సంధ్య అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో సోమవారం యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. విద్యలో రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలన్నారు. యోగా చేయటం వల్ల ఆరోగ్యం, ధ్యానం చేయటం వల్ల ఏకాగ్రత లభిస్తాయన్నారు. గీతా శ్రీకాంత్, పర్యాటకశాఖ అధికారి ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ అవతారం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ అవతారం కోరారు. మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయరాదని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల చిత్రాలను ప్రాజెక్టు రూపంలో తెరపై వేసి చూపించారు. జేసీఐ సభ్యులు, గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసులు, తెలుగు విభాగ అధిపతి గౌరీశంకర్ ఉన్నారు.

ఉద్యోగాలకు 250 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐటీ, పారిశ్రామిక రంగాల్లో కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అని డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ అన్నారు. డిగ్రీ పట్టా అందుకోకముందే ఇప్పటివరకు కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాలు సాధించినట్టు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారితో అభినందన సమావేశాన్ని కళాశాలలో సోమవారం ఏర్పాటు చేశారు. ఇంటర్ తర్వాత ఏంచేయాలనే ఆలోచించకుండా డిగ్రీలో తమ పిల్లలను చేర్పిస్తున్న తల్లిదండ్రులు వారి ఉజ్వల భవిష్యత్‌ను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మంచి వార్షిక వేతనంతో కార్పొరేట్ కొలువులు (క్యాంపస్ డ్రైవ్స్)సాధించడం హర్షణీయమని సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందలు తెలియజేశారు.

కూటమికి ఓటమి ఖాయం

- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



జి.సిగడాం: సేతుభీమవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, చిత్రంలో ఎంపీ బెల్లాన

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, కూటమి నాయకుల ఓటమి ఖాయమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గెడ్డంచరాం, సేతుభీమవరం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండలం నుంచి వైఎస్సార్‌సీపీ అధిక్యత మెజార్టీ రావాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను సీఎంను చేద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తొత్తడి రామారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, జిల్లా మహిళా కన్వీనర్ నక్క హేమలత, ఎంపీటీసీలు మంగమ్మ, గోవిందరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని అర్జునవలస, వేల్పురాయి పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందు వచ్చే టీడీపీ, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, గ్రామ నాయకులు కెల్ల రామకృష్ణ, గురాన ప్రసాద్, రెడ్డి రామునాయుడు, మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

జి.సిగడాం: మండలంలోని నడిమివలస, ఎందువ, నర్సింహంపురం గ్రామాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను అధిక్యత మెజార్టీతో గెలిపించాలన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ఎంపీపీ మీసాల సత్యవతి, మండల మహిళా కన్వీనర్ కందిరమాదేవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వాన ప్రమీల, సర్పంచ్ బాలి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: వేల్పురాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



జి.సిగడాం: ఎందువలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ పరిమళ

ఓట్లు కోసమే బీసీ జపం



రణస్థలం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న సనపల నారాయణరావు

రణస్థలం: ఎచ్చెర్లలో బీసీ గర్జన అంటూ కూటమి నాయకులు సమావేశాలు నిర్వహించడం హస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో 85 శాతం బీసీలుంటే ఒక్క శాతం కూడా లేని ఓసీ అభ్యర్థికి కూటమి టిక్కెట్ కేటాయించి, బీసీ గర్జన సమావేశాలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 56 బీసీ కులాలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చి ప్రత్యేక గుర్తింపును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. నియోజకవర్గంలోని బీసీలంతా ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, పార్టీ నాయకులు చిల్ల వెంకటరెడ్డి, కొయ్యి సోములు రెడ్డి, ముద్దాడ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బీసీలపై టీడీపీది కపట ప్రేమ

ఎచ్చెర్ల క్యాంపస్: బీసీల గురించి మాట్లాడే హక్కు టీడీపీ నాయకులకు లేదని ఎచ్చెర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు అన్నారు. ఎచ్చెర్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ గ్రామాల్లో జయహో బీసీ గర్జన పేరుతో సమావేశాలు నిర్వహించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. ఎచ్చెర్ల నియోజక వర్గంలో 90 శాతం బీసీలు ఉండగా, 10 శాతం లేని ఓసీ అభ్యర్థికి కూటమి సీటు కేటాయించారని విమర్శించారు. కూటమి అభ్యర్థి, బీజేపీ నాయకుడు నడుకుదిటి ఈశ్వరరావు కమ్మ సామాజికవర్గానికి చెందినవారు కాదా అంటూ ప్రశ్నించారు. బీసీలపై కూటమికి ఎన్నికల సమయంలోనే ప్రేమ పుట్టుకువస్తుందని, బీసీ సీటు ఓసీ కేటాయించి నీతులు చెప్పటం అంటే దెయ్యాలు వేదాలు వల్లించటమేనన్నారు. మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి మాట్లాడుతూ బీసీ మహిళ బల్లాడ హేమమాలినీ రెడ్డికి రాష్ట్ర మహిళా సహకార సంస్థ కార్పొరేషన్ అధ్యక్షురాలిని చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 56 సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్ మాట్లాడుతూ బీసీ సమాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు బీసీల పూర్తి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు బగ్గు రాజారావు, డొంక వెంకటరమణ, పంచిరెడ్డి రాంబాబు, శీరపు శ్రీరామ్మూర్తి, చిలక సన్యాసప్పడు, దుంప చిన్నారెడ్డి, జరుగుళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి



త్రీ వన్ లోగోను ఆవిష్కరిస్తున్న ఏఓ రామకృష్ణ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ పరిపాలన అధికారిముని రామకృష్ణ అన్నారు. క్యాంపస్‌లో సోమవారం తెలుగు విభాగం, త్రీ వన్ క్లబ్ ఆధ్వర్యంలో త్రీ వన్ లోగోను ఆవిష్కరించారు. ప్రస్తుతం ప్రపంచ భాష, ఉపాధి భాషగా ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉన్నా, మాతృభాషకు సైతం ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సాహిత్యం, భాష, సంస్కృతిని భవిష్యత్ తరాలకు తెలియజేయటం, తెలుగు గొప్పతనాన్ని విస్తరించటం కోసం త్రీ వన్ క్లబ్ కృషి చేస్తుందన్నారు. అంతర్జాతీయంగా ఆన్‌లైన్ తెలుగు జర్నల్స్, మ్యాగ్‌జైన్లు తీసుకురావటం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తెలుగు భాషను ఆప్షన్‌గా ఎంచుకుంటే ఒత్తిడి లేని విద్యకు అవకాశం ఉంటుందన్నారు. సాహిత్యం, నవలలు, కథలు, ఆత్మ కథలు, చరిత్రలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. ఓఎస్‌డీ ఎల్.సుధాకర్, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ చౌదిరి, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఏపీ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో రెండు ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఐ ఆస్పత్రి శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో సుమారు 40 మంది ప్రభుత్వ పింఛనుదారులకు ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఆరుగురికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తు చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఐ ఆస్పత్రి డాక్టర్ గీతాంజలి, విశాఖపట్నం మేనేజర్ చంద్రశేఖర్, శ్రీకాకుళం మేనేజర్ పూర్ణచంద్రరావు, వివేక్, జగదీష్, కుసుమ పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళంలోని అమృత మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సుమారు 20 మంది ప్రభుత్వ పింఛనుదారులకు ఉచిత దంత పరీక్షలు జరిపారు. నలుగురికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. డాక్టర్ ప్రేమ్ సక్కరి, డాక్టర్ మహేష్, ఏపీ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సంఘ అధ్యక్షుడు కె.సోమసుందరరావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ప్రసాదరావు, శ్రీకాకుళం సిటీ బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు బలరాం కృష్ణారావు, అధ్యక్షులు బి.జానకీరామ్ పట్నాయక్, కోశాధికారి రామమోహనరావు, జిల్లా సంఘ సహాయ అధ్యక్షులు పి.నరసింహమూర్తి, జిల్లా సంఘ కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వైద్యులు, యూనియన్ ప్రతినిధులు

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

జి.సిగడాం: శ్రీకాకుళం-రాజాం ప్రధాన రహదారిలోని సంతవురిటి కూడలి వద్ద చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ బుడారి లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహం తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ప్రతినిధి.. స్వర్గీయ దూసి ధర్మారావు 74వ జయంతి ఉత్సవాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నైపుణ్యాభివృద్ధి కేంద్ర భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు, అతని మనుమడు దేవగురులకు నివాళిగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన 20 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే ఏడు రోడ్ల కూడలి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం భగీరథపురంలో 15 మంది దివ్యాంగులకు కిట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రతినిధులు కనుగుల దుర్గా శ్రీనివాస్, బలివాడ మల్లేశ్వరరావు, దూసి వెంకటరమణమూర్తి, మండల శ్రీనివాస్, సురంగి మోహనరావు, నిక్కు అప్పన్న, ఆర్జ్ సన్యాసిరావు, చక్రవర్తి, బి.సతీష్, పెంకి చైతన్యకుమార్, ఉమాశంకర్, పవన్‌కుమార్ ఉన్నారు.

ధర్మారావు జయంతి సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన లలిత గీతాల సంగీత స్వరసుధ చక్కగా ఆకట్టుకుంది. తరుణి కృష్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మారావు రచించిన పలు లలిత గీతాలను గాయకులు నిక్కు అప్పన్న, కల్యాణం రామ్మోహన్‌రావు, రెడ్డి సత్యన్నారాయణ బృందం ఆలపించారు.

చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

- నగర పాలకసంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, బంగారు, వస్త్ర దుకాణాల యజమానులు, లైసెన్స్‌డు ఇంజినీర్లు వంటివారంతా ముందుకు రావాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ వర్గాలతో సోమవారం సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలో ఇప్పటికే పలు ప్రధాన కూడళ్లలో కార్పొరేషన్ ద్వారా 20 చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎవరిస్థాయిలో వారు ప్రజల్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఎండనుంచి రక్షణ కల్పించేందుకు గ్రీన్‌షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. దీనికి పలు ఇంజినీరింగ్ సంస్థలు ముందుకొచ్చి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రణస్థలం: రాజీనామా చేసిన వల్లభరావుపేట వలంటీర్లు



జి.సిగడాం: రాజీనామా పత్రాలతో సంతవురిటి గ్రామ వలంటీర్లు

రణస్థలం: రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అడ్డగోలు విమర్శలకు మానసికంగా ఇబ్బందిపడి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామని వలంటీర్లు తెలిపారు. మండలంలోని వల్లభరావుపేట, సంచాం, కొండములగాం గ్రామ వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శి గురాన మానస, సంచాం సర్పంచ్ రెడ్డి రాము, నాయకులు మహంతి సత్యానారాయణ, కొత్తకోట్ల పరిశినాయుడు, రెడ్డి అనంద్ తదితరులు ఉన్నారు.

జి.సిగడాం మండలంలో..

జి.సిగడాం: మండలం పరిధిలో పలు గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె వెంకన్నబాబుకు 98 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందించారు. సంతవురిటి గ్రామ వలంటీర్లంతా ఓకేసారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు.

నేడు పలు చోట్ల ఉగాది వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు చోట్ల క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించేందుకు, పురస్కారాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గుజరాతీపేట బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జగన్నాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు పన్నాల నరసింహమూర్తి, నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం ఉంటుందని..అలాగే ఉగాది పురస్కారాలను పెంట శ్రీనివాసశర్మ (ఉత్తరాంధ్రా అర్చక సంఘం అధ్యక్షులు), జె.సత్యవాణి (ప్రముఖ న్యాయవాది)కి అందించనున్నారు. అలాగే అరసవల్లి ఆదిత్య నగర్‌కాలనీ ఎనిమిదో లైనులో ఉన్న ఎంసీఏ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిలో డాక్టర్ ఆరికతోట కనకరాజు, అడపా అన్నమరాజు స్వామి, కె.ఎ.రాములు, పూజారి లక్ష్మణరావు, మనబడి వెల్ఫేర్ అసోసియేషన్(వల్లేవలస)ప్రతినిధులకు ఉగాది పురస్కారాలు అందిస్తామన్నారు. పట్టణంలోని సత్యసాయి పెద్దమందిరంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా చలివేంద్రం ప్రారంభిస్తున్నామని మందిరం కన్వీనర్ మురళీ తెలిపారు. చలివేంద్రం జూన్ 30 వరకు కొనసాగుతుందన్నారు. ఉచిత సంగీత శిక్షణలో భాగంగా హార్మోనియం, తబలా, డోలక్, కంజీర, వాకల్‌పై శిక్షణను ప్రారంభిస్తామని చెప్పారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, అమృత కలశాల పంపిణీ, పండిత సత్కారం ఉంటుందన్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అదపాక గ్రామానికి చెందిన గుడ్ల అప్పలరాజు వద్ద అక్రమంగా నిల్వ చేసిన 30 మద్యం బాటిళ్లను లావేరు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4,200 ఉంటుందని ఏఎస్సై కె.భుజంగరావు తెలిపారు. అప్పలరాజుపై కేసు నమోదు చేశామన్నారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీకాకుళం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని రాగోలు జంక్షన్ వద్ద సోమవారం రాత్రి తోటాడ గ్రామానికి చెందిన నూక నర్సింగరావు అనుమతి లేకుండా మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇతనివద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసున్నారు. రూరల్ పోలీసులకు అందించిన సమాచారం మేరకు నర్సింగరావుపై కేసు ననమోదు చేసినట్లు ఎస్సై వాసుదేవరావు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కొన్నావీధి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి విధులు నిర్వర్తిస్తున్న రెండోపట్టణ హెడ్ కానిస్టేబుల్‌పై ఇద్దరు వ్యక్తులు దాడికి యత్నించారు. అర్ధరాత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించినందుకు దాడికి దిగారు. ఈ విషయాన్ని ఆయన సీఐ ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా.. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఐ ఇద్దరు వ్యక్తులపై సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

వేడుకగా ఉగాది



జి.సిగడాం: మండలంలోని అద్వాన్నంపేట ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం కె.అరుణకుమారి ఆధ్వర్యంలో సోమవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు నూతన దుస్తులను ధరించి, పలు వినోద కార్యక్రమాల్లో సందడి చేశారు. ఉగాది పచ్చడిని ఆరగించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు అన్నారు. కేశవరావుపేటలో సోమవారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం గ్రామాల్లో కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామాల పరిస్థితిపై అవగాహన ఉందన్నారు. శాంతిభద్రతలకు సమస్యలు సృష్టించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. యువత వివాదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.